# దేవుడి కోపమొచ్చింది!

[ఒక ఆంగ్లకవి భావం]

●

రాత్రి పదకొండుఘంట లవుతుంది. అందరూ భగవన్నామస్మరణ చేసుకుని ఇక పండుకోబోతారు. ఆ సమయమందు దేవదేవుడు స్వర్గలోకమందు సుఖాసీనుడై, మానవజాతి నివేదించుకునే ప్రార్థనాపరంపరను అతిశ్రద్ధతో ఆలకిస్తున్నాడు. ఒక్కొక్క మొరనే వరసగా చెవినిబెట్టి, వెంటవెంటనే భగవంతుడు సెలవిచ్చే ఆశీస్సులను గబగబ రాసుకుంటున్నాడు ప్రయివేటు సెక్రటరీ.

ఒక కోటీశ్వరుని ప్రార్థన :

“హే భగవన్! ఇప్పుడే నేను ఒకటవరకపు అమెరికను మోటారుకారుకు ఆర్డరిచ్చివున్నాను. దానిపయిన ఈగయిన వాలకుండ అది సప్తసముద్రాలూ దాటుకుని భద్రంగా నాయిల్లు చేరేటట్టు ఓకంట కనిపెట్టాల్సిన భారం నీదే స్వామీ!......”

‘సరే’ నన్నట్టుగా దేవుడు తలవూపాడు. ‘గ్రాంటెడ్’ అని చెప్పి సెక్రటరీ అనుకూలమయిన రిమార్కు రాసుకున్నాడు.

తదుపరి—

ఎజండాలో : ఉద్యోగంకోసం పెనగులాడుతున్న ఒక అభ్యర్థి మొర. తక్కిన అప్లికేషన్లు యావత్తూ తొక్కిపెట్టి, తనదిమాత్రం నెగ్గేటట్టు అనుగ్రహించవలసిందని ఆతడి యావ.

చర్రుమని దేవుడికి కోపం వచ్చింది. చిర్రుబుస్సులాడుతూ, “వీల్లేదు” అని రాసిపారెయ్యమని సెక్రటరీకి ఆజ్ఞాపించాడు.

వెంటనే సెక్రటరీ లేచి, “ఇదేమిటి యేలికా! అట్లా ఆగ్రహిస్తారేం?—ఆ శ్రీమంతుడి మోటారుకారుపయిన ఈగయిన వాలకుండ చేయటానికి తడయక సమ్మతించివుంటిరే, పాపం—పొట్టగడవని ఒక పేద... నవుకరీకోసం నానాపాట్లూ పడుతూవుంటే కేవలం నిరాకరించటం...?”

అనేసరికి, దేవు డిట్లా అన్నాడు :

“శ్రీమంతుడు ఏ అయిదేళ్లకో వక్కసారి ముచ్చటగా కోరిక కోరుకుంటాడు. తీర్చ బుద్ధేస్తుంది. కాని, ఈ పేదవాళ్లు తెల్లారి లేచిందిమొదలూ అనుక్షణమూ ఏదో కొరత చూపిస్తూ మనల్ని పీక్కుతింటూనేవుంటారు. రోజూ చచ్చేవాళ్లకోసం ఏడ్చే దేమిటి? అర్జీ తోసిపారెయ్...”

— ముద్దా విశ్వనాథం.